క్లుప్తంగా

ఆవాసానికి విరాళం



విరాళం అందిస్తున్న విజయ్ కుటుంబీకులు

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద ఆవాసం నిర్వాహకులకు సోమవారం రూ.50వేల విరాళం అందజేశారు. కడెం మండలం లింగాపూర్‌కు చెందిన గనగొని విజయ్‌కుమార్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబసభ్యులు నిషిత, అయాన్‌గౌడ్, వియాన్‌గౌడ్, తల్లి నర్సవ్వలు ఆవాసం అధ్యక్షుడు శైలేశ్ మాశెట్టివార్‌కు విరాళం అందించారు. ఆవాస్ ప్రముఖ్ లింగారెడ్డి తదితరులున్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోండి

నర్సాపూర్(జి)/కుంటాల/ముథోల్: ఇల్లు లేని నిరుపేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అల్లాడి వనజ, కుంటాల ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ముథోల్ ఎంపీడీవో సురేశ్‌బాబు వేర్వేరుగా ప్రకటనల్లో తెలిపారు. దరఖాస్తు ఫారంతోపాటు రేషన్‌కార్డు, ఆధార్, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను ఈనెల 10లోగా ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు



ఓలాలో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

కుంటాల: మండలంలోని ఓలా, సూర్యాపూర్, లింబా(కే), లింబా(బీ) గ్రామాల్లో సోమవారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులను గుర్తించేందుకు పలువురి వేలిముద్రలను తీసుకున్నారు. ఎస్సై హన్మాండ్లు, పోలీసులు నిమ్మ కిరణ్, బిక్కు, రామారావు తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. యూరియాకు బస్తా ధర రూ.270, 20:20:13 ఎరువుల బస్తా ధర రూ.1140 ఉందన్నారు. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

ఎమ్మెల్సీని కలిసిన 'పాకాల'



కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: నిజామాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణాచారి, రాజారెడ్డి, గంగన్న, రుక్మారెడ్డి తదితరులు ఉన్నారు.

కడెం తహసీల్దార్‌గా రాజేశ్వరి



కడెం: కడెం తహసీల్దార్‌గా ఎం.రాజేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఆసిఫాబాద్ జిల్లా నుంచి కడెంకు బదిలీపై రాగా.. ఇన్నిరోజులు డిప్యూటీ తహసీల్దార్ చిన్నయ్య ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. డీటీ చిన్నయ్య, సిబ్బంది వారికి స్వాగతం పలికారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె



ప్రమాదం జరగకుండా అమర్చిన కంచె

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు కంచెలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. దీనిపై గత నెల 18 'సాక్షి'లో ఆదమరిస్తే ఇక అంతే అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి న్యూకంజర్ వెళ్లే మార్గంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేశారు.

పొదుపు అలవర్చుకోవాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల మహిళలు పొదుపును అలవర్చుకోవాలని ఏపీఎం భోజన్న పేర్కొన్నారు. సోమవారం కుంటాలలో నిర్వహించిన శ్రీరామకృష్ణ గ్రామ సంఘ సమావేశంలో మాట్లాడారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. సీసీ యూసుఫ్, వీవోఏ ఓంకార్ దేవన్న, సురేఖ, సుమాలిని పాల్గొన్నారు.

బడిని బతికించుకుందాం

- పంచగుడి–ధర్మోర ఉన్నత పాఠశాలలో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఒకప్పుడు 150 మంది.. ప్రస్తుతం 48
- వసతుల్లేకపోవడమే ప్రధాన కారణం..
- ఆరుగురు ఉపాధ్యాయులున్నా.. పెరగని అడ్మిషన్లు



పంచగుడి–ధర్మోర ఉన్నత పాఠశాల భవనం



నీటి సౌకర్యం లేని మరుగుదొడ్డి

లోకేశ్వరం: సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. లోకేశ్వరం మండలంలోని పంచగుడి–ధర్మోర ఉన్నత పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో ఒకప్పుడు 150 మంది విద్యార్థులతో కళకళలాడిన పాఠశాల నేడు 48 మందికే పరిమితమైంది. వసతుల్లేకపోవడం, అవగాహన కల్పించకపోవడంతో పాఠశాలలో చేరే వారి సంఖ్య ప్రతి సంవత్సరం తగ్గుతూ వస్తుంది.

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా తగ్గిపోతోంది. గతేడాది పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రస్తుతం పదో తరగతిలో ఎనిమిది మంది ఉండగా ఐదుగురు మాత్రమే పాఠశాలకు హాజరవుతున్నారు. మిగతా తరగతుల్లోనూ పెద్దగా విద్యార్థులు లేరు. సంఖ్య పెంచేందుకు సర్పంచ్, ఎంఎస్‌పీ చైర్మన్, ఉపాధ్యాయులు ఆరాట పడుతున్నా.. అధికారులు చర్యలు చేపట్టడంలేదు.

సమస్యల తిష్ట..

పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. పాఠశాల భవనంలో మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. బాలబాలికలకు మరుగుదొడ్లు ఉన్నా.. నీటి సౌకర్యం లేదు. తలుపులు కూడా సరిగా లేవు. స్కావెంజర్ లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. తరచుగా విద్యుత్ సమస్యలొస్తున్నాయి. తాగునీటి కోసం ఆర్వోప్లాంట్ లేదు. ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోకి పశువులు తిరుగుతున్నాయి.

తరగతుల వారీగా విద్యార్థుల వివరాలు..

పాఠశాలలో మొత్తం 48 మంది చదువుతున్నారు. ఆరో తరగతిలో 13 మంది, ఏడో తరగతిలో ఏడుగురు, ఎనిమిదో తరగతిలో ఎనిమిది మంది, తొమ్మిదో తరగతిలో పన్నెండు మంది, పదో తరగతిలో ఎనిమిది మంది చదువుతున్నారు.

అడ్మిషన్లు పెంచేందుకు ముందుకురావాలి..

ఉపాధ్యాయులతోపాటు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలి. కనీస సౌకర్యాలు కల్పించిన తర్వాత అవగాహన ర్యాలీలు నిర్వహించాలి.

నీటి సౌకర్యం కల్పించండి



పాఠశాలలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డికి నీటి సౌకర్యం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించాలి.

– స్పందన, పదోతరగతి విద్యార్థి

విద్యార్థుల సంఖ్య పెంచుతాం



సౌకర్యాలు కల్పించగానే.. పాఠశాల సమీపంలోని గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూస్తాం. అడ్మిషన్లు పెరిగేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. అందరం కలిసి బడిని కాపాడుకుంటాం.

–ఎల్లన్న, పంచగుడి సర్పంచ్

నిధులు మంజూరవగానే పనులు చేపడుతాం

నీటి సౌకర్యం లేక కొన్ని పాఠశాలలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. పంచగుడి ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత ఉన్న మాట వాస్తవమే. మనఊరు–మనబడి రెండో విడతలో నిధులు మంజూరవగానే అన్ని పనులు చేపడుతాం.

– చంద్రకాంత్, లోకేశ్వరం ఎంఈవో

తల్లిపాలే చిన్నారులకు అమృతం



సారంగాపూర్: కంకెటలో..



మాట్లాడుతున్న లక్ష్మణచాంద తహసీల్దార్ శ్రీలత

నిర్మల్‌ఖిల్లా: తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాల గురించి గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. అంతకుముందు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులు, తల్లులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పద్మ, జ్యోతి, శైలజ, సావిత్రి, రాము తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని కంకెటలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కంకెట సర్పంచ్ ఈసరి భగీరథ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించాలని తహసీల్దార్ శ్రీలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించగా తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన్న చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళులర్పించిన నాయకులు



ముథోల్‌లో నివాళులర్పిస్తున్న వీజేఎస్ నేతలు



కడెంలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముథోల్: తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ప్రజాయుద్ధనౌక గద్దర్ మరణం జీర్ణించుకోలేకపోతున్నామని వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ అన్నారు. సోమవారం ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి తులసీరాం, నాయకులు మీనాజ్, రాజు, గంగాధర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా భైంసాలోని పలు పాఠశాలల్లో నివాళులర్పించారు. పట్టణంలోని శ్రీ మేధా హైస్కూల్‌లో గద్దర్ మృతికి సంతాపంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మౌనం పాటించి అంజలి ఘటించారు. డైరెక్టర్ ప్రేమానంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం గద్దర్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, రఫీక్, భూషణం, రమేశ్, బ్రహ్మాచారి, చాంద్‌పాష తదితరులు ఉన్నారు.

సామాజిక ఉద్యమకారుడు గద్దర్ మరణం తీరని లోటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో గద్దర్ మృతికి సంతాపంగా ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకుడు కోట వేణు, మండలాధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ నాయక్, చిన్నయ్య, రాజన్న తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సంతాపం ప్రకటించారు. మౌనం పాటించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మాధవ్, ఉపాధ్యాయులు కల్పన, గంగామణి, తదితరులు ఉన్నారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా'

కుభీర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ముథోల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని డాక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన డాక్టర్ కిరణ్‌కుమార్ స్వగ్రామంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. నాలుగేళ్లుగా కిరణ్ ఫౌండేషన్ ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించడంతోపాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని.. ఆదరించాలని కోరారు. సిర్పెల్లి, పల్సి, కుభీర్ గ్రామాల్లో తన అనుచరులతో పర్యటించారు. ఏయే పార్టీలో చేరేది త్వరలో నిర్ణయించుకుంటామన్నాని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నుంచి ఆహ్వానం వచ్చిందని.. ఏయే పార్టీలో చేరేది త్వరలో నిర్ణయిస్తామన్నారు.ఎంపీటీసీ దేవిదాస్, డాక్టర్ హృశికేష్, రాజన్న తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిర్మల్‌రూరల్: జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకులంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'చేనేత వస్త్రాల ప్రాముఖ్యత–ప్రభుత్వ కృషి' అంశంపై నిర్వహించిన పోటీలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ప్రిన్సిపాల్ నీరడి గంగాశంకర్ ప్రారంభించగా.. సెక్టోరియల్ అధికారి ప్రవీణ్‌కుమార్, జిల్లా సైన్సు అధికారి వినోద్‌కుమార్, డీసీఈబీ సెక్రెటరీ భానుమూర్తి విజేతలను నిర్ణయించారు.

విజేతల వివరాలు..

- తెలుగు మీడియంలో ప్రథమ బహుమతి ఇ.రోహిత,(9వ, సోఫినగర్, గురుకులం).. ద్వితీయ బహుమతి ఇ.అక్షయ, (10వ, కేజీబీవీ నిర్మల్‌అర్బన్), ఎ.శ్రీజరెడ్డి, (9వ, విజయ ఉన్నత పాఠశాల, నిర్మల్).. తృతీయ బహుమతి టి.నిఖిల్, (10వ, గుండంపెల్లి జెడ్పీ పాఠశాల, దిలావర్‌పూర్), యస్.హర్షవర్ధిని, (10వ, సోఫినగర్ గురుకులం) సాధించారు.
- ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతి భక్తిపటేల్, (10వ, వాసవి పాఠశాల, నిర్మల్).. ద్వితీయ బహుమతి హర్షవర్ధన్‌గౌడ్, (10వ ఎంజేపీ, రాచాపూర్, లక్ష్మణచాంద), యస్.శివప్రియ, (9వ, యస్ఆర్‌డీజీ ఉన్నత పాఠశాల, నిర్మల్).. తృతీయ బహుమతి గిరిచందన్, (9వ, మామడ జెడ్పీ పాఠశాల) సాధించారు.
- ఉర్దూ మీడియంలో ప్రథమ జుఫిషాన్ అంబర్, (10వ , హీరా మోడల్ పాఠశాల, నిర్మల్).. ద్వితీయ బహుమతి మారియ మాహిన్,(9వ, బ్లూస్టార్ పాఠశాల, నిర్మల్).. తృతీయ బహుమతి రిమిష బేగం, (10వ, బ్లూ స్టార్ ఉన్నత పాఠశాల, నిర్మల్) మదీహనాజ్ , (9వ, హీరా మోడల్ పాఠశాల) సాధించారు.

చిన్నారులకు సన్మానం

నిర్మల్‌ఖిల్లా: వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన చిన్నారులు ప్రతిభ కనబర్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ కరాటే అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తేజేందర్‌సింగ్, స్థానిక వైద్యులు డాక్టర్ కిరణ్ చిన్నారులను అభినందించారు. కరాటే సాధనతో మనలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. అనంతరం శిక్షకులు అమ్ముల భూషణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు రాము, గైక్వాడ్ రాజ్‌కుమార్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెమలి అప్పగింత

కుంటాల: మండలంలోని వెంకూర్ పంట పొలాల్లో సోమవారం ఉదయం నడవలేని స్థితిలో ఉన్న నెమలిని రైతు గోవిందరావు గుర్తించాడు. గ్రామంలోని చావడికి తీసుకొచ్చి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఎఫ్‌బీఓ స్రవంతికి నెమలిని అప్పజెప్పగా పశువైద్యాధికారి ప్రకాశ్ చికిత్స అనంతరం అడవిలో వదిలేసినట్లు ఎఫ్‌బీఓ తెలిపారు.

మంత్రిని కలిసిన నేతలు

కుంటాల: కొత్త పంచాయతీ కార్యాలయాల్లో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి గంగుల కమలాకర్‌కు సోమవారం హైదరాబాద్‌లో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో జీవి రమణారావు, సాంప్లీ రమేశ్, సోలంకి భీంరావు, పండిత్ పటేల్, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

మొరం తవ్వకాలు అడ్డగింత



విచారణ చేస్తున్న ఎఫ్ఎస్‌వో సుధాకర్

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామసమీపంలో అనుమతుల్లేకుండా చేపట్టిన మొరం తవ్వకాలను సోమవారం అధికారులు అడ్డుకున్నారు. పొక్లెయిన్, ట్రాక్టర్లో మొరం తరలిస్తుండగా పలువురు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎఫ్ఆర్‌వో వినాయక్ ఆదేశాల మేరకు ఎఫ్ఎస్‌వో సుధాకర్, సిబ్బంది అక్కడికి వెళ్లి తవ్వకాలను నిలిపివేసి విచారణ జరిపారు. ఈ విషయమై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు మామూలుగా వ్యవహరించడంతోనే ఈ తవ్వకాలు సాగుతున్నాయనే గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

భైంసాటౌన్: కుభీర్‌లోని సెక్షన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏడీఈ కె.ఆదిత్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందని.. భైంసా, కల్లూర్, భైంసారూరల్, కుభీర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యల పరిష్కారానికి వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీయూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

నిర్మల్‌రూరల్:తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్)13వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎ.మురళి మనోహర్‌రెడ్డి సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో ఏర్పడిన టీయూటీఎఫ్ పన్నెండేళ్ల ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.లక్ష్మిప్రసాద్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట గంగాధర్, తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి స్వదేశీ పరికిపండ్ల తదితరులు పాల్గొన్నారు.

'అర్హులను పట్టించుకోని ప్రభుత్వం'



ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

ఖానాపూర్: అర్హులను పట్టించుకోకుండా ప్రభుత్వం ధనవంతులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇళ్లను సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఎంతో మంది పేదలు ఇళ్ల కోసం ఆందోళనలు చేస్తుంటే.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇల్లులేని వారికి ప్లాట్లను కేటాయించి ఇల్లు నిర్మించేందుకు రూ.మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుపతి, నాగెల్లి నర్సయ్య, తొడసం శంభు, దుర్గం పోషలింగు, వర్మ తదితరులున్నారు.

ఈవీఎం యంత్రాలపై అవగాహన

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో సోమవారం ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై ఓటర్లకు ఎన్నికల సూపర్‌వైజర్లు షేక్ రఫీక్, విజయ అవగాహన కల్పించారు. నూతన ఓటర్లకు ఓటు వేసే విధానం వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ తాహెర్‌ఖాన్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని జగదాంబతండాలో సోమవారం ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. 64వ పోలింగ్ కేంద్రంలో ఈసందర్భంగా ఓటుహక్కు ప్రాధాన్యత, ఓటు వేసే విధానం వివరించారు. సూపర్‌వైజర్ హుస్సేన్, బీఎల్ఓ కవిత తదితరులున్నారు.

నర్సాపూర్(జి): ముథోల్ నియోజకవర్గంలోని గొల్లమాడ గ్రామస్తులకు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల వినియోగంపై పర్యవేక్షక అధికారి (ఏఎస్ఓ) జాదవ్ సాయికృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్న మహేశ్, ఏఎస్సై మాన్‌సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సైగా ఎంపికైన సుస్మితకు సన్మానం

కుభీర్: మండలంలోని నిగ్వా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న సుస్మిత సివిల్ ఎస్సైగా ఎంపికైన విషయం తెలిసిందే. సోమవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంఈవో చంద్రకాంత్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు సంజీవ్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర తదితరులున్నారు.

వైభవంగా అధికమాసం వాయినం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి–గోవిందామాంబ ఆలయంలో విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అధికమాసం పురస్కరించుకొని వివిధ పదార్థాలతో స్వామివారికి వాయినం సమర్పించారు.

భైంసా తహసీల్దార్ బదిలీ

భైంసాటౌన్: భైంసా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై వెళ్లనున్నారు. ఈ మేరకు మెదక్‌కు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన తెలిపారు. దీంతో పలువురు ఆయనను కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆయన స్థానంలో డీటీ సూర్యప్రకాశ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

జీపుయాత్ర ప్రారంభం

ఖానాపూర్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారం వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సమరభేరి జీపుయాత్రను ప్రారంభించారు. సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ–ప్రభుత్వ విద్యా పరిరక్షణకు సమరభేరి జీపుజాత చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నవీన్, జిల్లా కార్యదర్శి శీతాకాల అరవింద్, పరమేశ్వర్, ఉదయ్, ప్రతాప్, చరణ్, సాయి తదితరులున్నారు.

పరిశీలన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఎదుట నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. వారి వెంట కౌన్సిలర్లు సాజిద్‌ఖాన్, అన్వర్‌పాషా, ముజాయిద్, కాలనీవాసులు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి

నిర్మల్‌రూరల్: వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాల బారిన పడకుండా ఉండాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.గంగాదాస్ పేర్కొన్నారు. మండలంలోని వెంగవాపేట్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆయుర్వేద వైద్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వడపోసి కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో ఫార్మసిస్ట్ ఫణిందర్, ప్రధానోపాధ్యాయుడు తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రజల ప్రాణాలతో చెలగాటం'

సోన్: ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఎంపీపీ మానసరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలో డ్రెయినేజీలు, రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం పరిశీలించి రోగులకు మందులు పంపిణీ చేశారు. మిషన్ భగీరథ ప్లాంట్ పరిశీలించారు. అనంతరం లెఫ్ట్ పోచంపాడ్ సాంఘీక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీఓ ఖలీల్ హైమద్, డీఎల్‌పీవో రమేశ్, మెడికల్ అధికారి శ్రీనావాస్, ఎంపీటీసీ మార మల్కవ్వ, సర్పంచ్ మమత, హరీశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, సంగీతఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

తానూరు: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం ఆవరణలో సోమవారం ఎస్సై సందీప్‌ను పద్మశాలీ సంఘ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మార్కండేయ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో రాచ భూమన్న, సాయినాథ్, గంగుల చిన్నన్న, సంతోశ్, లక్ష్మణ్, నాగభూషన్, గణేశ్ తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899